

రైతునగర్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డితో గ్రామస్తులు



నిజామాబాద్‌లో పూజలు చేస్తున్న అర్చకులు

అంబరాన్నంటిన సంక్రాంతి వేడుకలు

# ఊరూవాడా సంబురం..

- పిండి వంటలతో ఇంటింటా ఘుమఘుమలు
- పతంగులు ఎగురవేసిన యువకులు, చిన్నారులు
- ఆకట్టుకున్న రంగవల్లులు

**ఉమ్మడి నిజామాబాద్** జిల్లాలో సంక్రాంతి పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించారు. మూడు రోజులపాటు సంక్రాంతి సందడితో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొన్నది. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, డీజే చప్పుళ్లతో గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లో పండుగ శోభ కనిపించింది. మహిళలు, యువతులు వేసిన రంగు రంగుల ముగ్గులతో వాకిళ్లన్నీ మెరిసిపోయాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా యువకులు, చిన్నారులు పతంగులు ఎగురవేశారు.

– నమస్తే తెలంగాణ యంత్రాంగం



కోటగిరిలో..



ఆర్మూర్‌లో ఓ ఇంటి ఎదుట వేసిన అయోధ్య రామాలయంతో కూడిన ముగ్గు



ఎల్లారెడ్డిలో ముగ్గులు వేస్తున్న యువతులు



నిజామాబాద్ నగరంలో ఓ ఇంటి ఎదుట గంగిరెద్దు విన్యాసం



మద్నూర్ మండలం లచ్చన్ గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో గ్రామస్తులతో కలిసి పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే




భిక్కనూర్ మండలం జంగంపల్లిలో రామజన్మభూమిపై ముగ్గు వేసిన యువతి



పిట్లంలో ముగ్గు వేస్తున్న యువతులు

---

రూపు మార్చుకున్న మత్తుమందు

# గంజాయి నూనె



- గుట్టుగా సాగుతోన్న విక్రయాలు
- గంజాయి మొక్కల నుంచి నూనె తయారీ
- కామారెడ్డిలో వెలుగు చూసిన గంజాయ్ నూనె

నిజామాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

గంజాయి రూపు మార్చుకుంటున్నది. గంజాయి ఎండు ఆకుల విక్రయం పాత పద్ధతి. గంజాయి చాక్లెట్లు, సిగరెట్లు వచ్చాయి. ఇప్పుడు సరికొత్తగా గంజాయిని నూనె రూపంలో విక్రయిస్తుండడం విస్తుగొల్పుతున్నది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో పట్టుబడిన గంజాయి నూనెను చూసి పోలీసులు అవాక్కయ్యారు. గంజాయి స్మగ్లర్లు తమ వ్యాపారాన్ని గుట్టుగా వివిధ రకాలుగా సాగిస్తుంటారు. బానిసలుగా మారిన యువతను టార్గెట్‌గా చేసుకుని అక్రమంగా రూ.కోట్లు సంపాదిస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న గంజాయి వినియోగంతో స్మగ్లర్లు కొత్త దారులు వెతికి వాటిని సప్లై చేస్తుండటం విస్మయం కలిగిస్తున్నది. గంజాయి నూనెను చిన్నపాటి డబ్బాలో పోసి విక్రయిస్తున్నారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా తేనె మాదిరిగా కనిపించే గంజాయిని సులువుగా విక్రయించేస్తున్నారు. ఇలా నూనె రూపంలో మార్చి విక్రయిస్తున్న ఓ ముఠా గుట్టును కామారెడ్డి దేవునిపల్లి పోలీసులు రట్టు చేశారు. చిన్నపాటి ప్లాస్టిక్ డబ్బాలో పోసి అమ్ముతున్న గంజాయి నూనెను ఎవ్వరూ గుర్తు పట్టకపోవడంతో ఇన్ని రోజులుగా మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా వారి వ్యాపారం సాగింది. పోలీసుల రంగ ప్రవేశంతో గంజాయి నూనె రూపంలో కూడా లభిస్తుందన్న విషయం వెలుగు చూసింది.

## సిగరేట్లలో కలిపి..

లిక్విడ్ గంజాయి లేదా గంజాయి నూనెను సిగరెట్లలో తంబాకుతో కలిపి యువత సేవిస్తున్నట్లు పోలీసుల పరిశోధనలో తేలింది. ఇంతకు ముందు ఎండు గంజాయిని సిగరేట్లలో నింపి పొగ తాగేవారు. అయితే, ఎండు గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు సులువుగా దొరికిపోతున్నట్లు గుర్తించిన అక్రమార్కులు.. రూట్ మార్చారు. గంజాయి నూనె ఆలోచనతో ఈ వ్యవహారానికి తెర లేపారు. గంజాయి నుంచి తీసిన నూనెను తంబాకుతో మిళితం చేసి సిగరెట్లలో నింపి పొగ లాగించేస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో వెలుగు చూసిన నూనె ఘటనతో ఉమ్మడి జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సిగరేట్లు ఎక్కువగా విక్రయమయ్యే దుకాణాలపై నిఘా పెట్టారు. కళాశాలల వద్ద మఫ్టీలో నిఘా పెట్టి ఆకతాయిలపై దృష్టి పెట్టినట్లుగా తెలిసింది.

## వెండి కన్నా ఎక్కువ ధర..

గంజాయి నూనె ధర చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. మార్కెట్లో ఈరోజు కిలో వెండి ధర రూ.78 వేలుగా ఉంది. అంటే వెండి ధర గ్రామునకు రూ.78 పలుకుతున్నది. అదే గంజాయి నూనె మాత్రం గ్రామునకు రూ.500 వరకు విలువ చేస్తుండటం విశేషం. కామారెడ్డి దేవునిపల్లి పోలీసులకు పట్టుబడిన 190 గ్రాముల నూనె విలువ రూ.97,500లుగా నిర్ధారించారు. గుట్టలు, అటవీ ప్రాంతాల్లో అక్రమంగా గంజాయి మొక్కలను పెంచి వాటి ద్వారా నూనెను తీస్తున్నారు. పచ్చి మొక్కలతోనే నూనె తీస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైజాగ్ పరిసర ప్రాంతాల్లో నూనెగా మార్చి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లుగా భావిస్తున్నారు. అక్రమార్కులు రైళ్లు, కొరియర్ మార్గాల్లో గుట్టుగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే దురాలోచనతో కొందరు యువకులు ఈ రొంపిలో దిగి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అంతర్రాష్ట్ర ముఠాలతో చేతులు కలిపి దందాలో పాత్రదారులుగా మిగులుతున్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి నూనె డబ్బాలు

### జీవితాలు నాశనం చేసుకోవద్దు..

నమ్మదగిన సమాచారం మేరకు దేవునిపల్లి పీఎస్ పరిధిలో గంజాయి నూనెను పట్టుకున్నాం. గంజాయి అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటాం. నిషేధిత గంజాయిని ఎవరైనా విక్రయిస్తే, వాడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదంటే 100కు ఫోన్ చేసి చెప్పొచ్చు. యువత సన్మార్గంలో నడవాలి. జల్సాలకు అలవాటు పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దు. చెడు అలవాట్లతో యువత పక్కదారి పడుతోంది. తల్లిదండ్రులు వారి కదలికలపై నిఘా పెట్టి ఉంచాలి.

**- శ్రీనివాస్, కామారెడ్డి రూరల్ సీఐ**



## నిందితుల రిమాండ్

కామారెడ్డి రూరల్, జనవరి 16: కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామ శివారులో గంజాయి ఆయిల్‌ను విక్రయిస్తున్న ఇద్దరిని, కొనుగోలు చేస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 14న క్యాసంపల్లి శివారులోని ఓపెన్ ప్లేస్‌లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దేవునిపల్లి ఎస్సై, సిబ్బంది దాడి చేసి ఏడుగురిని పట్టుకొని విచారించగా వారి వద్ద గంజాయి నుంచి తీసిన నూనె లభించింది. 190గ్రాముల గంజాయి నూనె విలువ సుమారు రూ.97,500 ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి నూనెను ఇద్దరు వ్యక్తులు అరకు నుంచి తీసుకొచ్చి కామారెడ్డిలో విక్రయిస్తున్నారు. క్యాసంపల్లిలో ఐదుగురు యువకులకు గంజాయి నూనెను విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని పోలీసులు పేర్కొన్నారు. నిందితుల నుంచి మూడు కార్లు, ఒక మోటార్ సైకిల్, రెండు స్కూటీలు, ఏడు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఆపరేషన్‌లో పాల్గొన్న కామారెడ్డి రూరల్ ఎస్సై శ్రీనివాస్ రాజు, పోలీసు సిబ్బందిని జిల్లా అదనపు ఎస్పీ కె.నర్సింహారెడ్డి అభినందించారు.

---

## చైనా మాంజాతో వ్యక్తికి గాయాలు

వినాయక్‌నగర్, జనవరి 16: పతంగులు ఎగురవేయడానికి ఉపయోగించిన చైనామాంజాతో ఒకరికి గాయాలైన ఘటన నిజామాబాద్ నగరంలో చోటు చేసుకున్నది. నాల్గో టౌన్ పరిధిలోని గాయత్రీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి సోమవారం తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా స్థానిక చైతన్య పబ్లిక్ స్కూల్ వద్ద ఆయన మెడకు ఒక్కసారిగా చైనా మాంజా వచ్చి తగలడంతో అతని మెడకు గాయమైంది. మెడకు చుట్టుకున్న చైనామాంజాను చేతితో తొలగించే క్రమంలో చేతికి కూడా గాయమైంది. చైనా మాంజా విక్రయంపై నిషేధం ఉన్నప్పటికీ వినియోగించడంతో వెంటనే బాధితుడు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా చైనా మాంజా కారణంగా ప్రాణాలు పోయేవని, తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నానని బాధితుడు తెలిపారు. చైనా మాంజాను నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయాడు.



చైనామాంజా తగిలి గాయపడ్డ వ్యక్తి

### పతంగి తీస్తుండగా విద్యుత్ షాక్...

**యువకుడికి తీవ్రగాయాలు**

బాన్సువాడ, జనవరి 16: పతంగి కోసం పరుగులు తీసిన యువకుడికి కరెంటు షాక్‌తో తీవ్రగాయాలైన ఘటన బాన్సువాడలో చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ పట్టణానికి చెందిన కరణ్‌సింగ్(22) ఈ నెల 15న పతంగి ఎగురవేస్తుండగా అది తెగిపోయింది. పతంగి వెళ్లి మిషన్ భగీరథ కార్యాలయ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు చిక్కుకున్నది. దీంతో పతంగిని తీసే క్రమంలో కరణ్‌సింగ్ అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాడు. గమనించిన స్థానిక ఆటో డ్రైవర్లు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రమాదంలో కరణ్‌సింగ్‌కు కరెంటు తీగలు తగిలి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించడంతో వైద్యులు నిజామాబాద్ దవాఖానకు రిఫర్ చేశారు.

---

## కమ్మేసిన పొగమంచు.. అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లిన ఆర్టీసీ బస్సు

గాంధారి, జనవరి 16: పొగమంచు కమ్మేయడంతో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఘటన గాంధారి మండలంలోని గుడిమెట్ గ్రామ సమీపంలో చోటు చేసుకున్నది. స్థానికులు, ఆర్టీసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బాన్సువాడ డిపోకు చెందిన బస్సు సోమవారం తెల్లవారుజామున బాన్సువాడ నుంచి కామారెడ్డికి బయల్దేరింది. గాంధారి మండలంలోని గుడిమెట్ గ్రామ సమీపంలో ఉదయం 5.30గంటలకు భారీగా పొగమంచు కురియడంతో రోడ్డు సరిగా కనిపించకపోవడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. బస్సులోని ప్రయాణికులంతా సురక్షితంగా ఉండడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్సై

పెద్దకొడప్‌గల్, జనవరి 16: మానవత్వానికి హోదాతో సంబంధం లేదని నిరూపించారు పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి. మండలంలోని బేగంపూర్ చౌరస్తా జాతీయ రహదారి 161పై ఆకలితో అల్లాడిపోతున్న అనాథను గుర్తించి చలించిన ఎస్సై కోనారెడ్డి వెంటనే పక్కనే ఉన్న హోటల్ నుంచి భోజనాన్ని తీసుకువచ్చి తినిపించారు. అనాథకు వేసుకోవడానికి కొత్త బట్టలు, దుప్పటి ఇచ్చారు. మానవత్వాన్ని చాటుకున్న ఎస్సైని స్థానికులు అభినందించారు.



అనాథకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎస్సై కోనారెడ్డి

### నేడు ఆంధ్రానగర్‌కు మంత్రి తుమ్మల రాక

నందిపేట్, జనవరి 16: నందిపేట మండలంలోని ఆంధ్రానగర్ గ్రామానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి బుధవారం వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి హాజరు కానున్నారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు ఇతర రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు.

---

## ఒంటరి మహిళలు, వృద్ధులే టార్గెట్

- బెదిరించి డబ్బులు వసూల్
- భార్యాభర్తల అరెస్ట్

రామారెడ్డి, జనవరి 16: ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపేట గ్రామానికి చెందిన గడీల భైరయ్య ఓ ప్రైవేటు న్యూస్ చానల్‌లో పనిచేస్తున్నాడు. కుటుంబ పోషణ భారంగా మారడంతో సులభంగా డబ్బులు సంపాదించాలని ఆలోచించాడు. ఈ క్రమంలో రోడ్డుపై ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధులకు మాయమాటలు చెప్పి, భయపెట్టి డబ్బులను డిమాండ్ చేసేవాడు. ఈ క్రమంలోనే జనవరి 11వ తేదీన మధ్యాహ్నం మండలంలోని ఫకీరాతండా రోడ్డు వద్ద జగదాంబతండా గ్రామానికి చెందిన భూక్యా ధూలి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్నది. భైరయ్య, ఆయన భార్య భాగ్యలక్ష్మి బైక్‌పై వస్తూ.. ఆమెను మాట్లాడించారు. 'నీ భర్త మరణించాడు కదా.. నీకు రూ.40 వేలు వస్తాయి. అందుకు కొంత డబ్బు ఖర్చు అవుతుంది. బైక్ వెనుకాల కూర్చున్న మేడం ఇప్పిస్తారు' అని భైరయ్య చెప్పాడు. ఆయన మాటలను నమ్మిన ధూలి డబ్బులను తీయగా.. రూ.ఆరు వేలు లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. దీంతో బాధితురాలు 12వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు 15వ తేదీన వాహనాలను తనిఖీ చేస్తుండగా.. భైరయ్య – భాగ్యలక్ష్మి అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నం చేశారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని పట్టుకొని విచారించగా.. నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.ఐదు వేలు నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.




వివరాలను వెల్లడిస్తున్న రామారెడ్డి ఎస్సై సుధాకర్